తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

సింహవాహనంపై
సిరిసంపదల దేవుడు
వైభవంగా కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

ముత్యపు పందిరిపై మాడా వీధుల్లో విహరిస్తున్న శ్రీనివాసుడు

చంద్రగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:
సింహ వాహనంపై సిరిసందల దేవుడు భక్తులకు దర్శనమిస్తూ తిరుమాడవీధులలో విహరించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చారు. కళ్యాణ వెం కన్న ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలం కరించి సింహవాహనంపై యోగ నరశింహస్వామి వారి అవతారంలో అధిష్ఠింపజేశారు. మూడవ రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మృగరాజును వాహనంగా చేసుకుని తిరుమాడ వీధులలో ఊరేగారు.

ముత్యపు పందిరిపై మూలపురుషుడు

ముత్యపు పందిరిపై మూలపురుషుడైన శ్రీనివాసుడు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. నిర్మలమైన కాంతులకు మూలాధారం ముత్యాలు, ఆ ముత్యాల కాంతులలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న సమయంలో దర్శించుకునేందుకు రాత్రి వేళ అనుకూలమైనందున మూడవరోజున రాత్రి భగవంతుడు ముత్యపు పందిరిలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ముత్యపు పందిరి వాహనసేవలో స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా భక్తుల ఈతి బాధలు తీరి ప్రశాంతత పొందగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో జెఇఒ డాక్టర్ శరత్ (విద్య, వైద్యం), ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ వరలక్ష్మి, ఏఈఒ ఎం.గోపినాథ్, ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగకుమార్, సూపరింటెండెంట్స్ రాజ్‌కుమార్, వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు -వార్త ప్రభావం

పెనగలూరు, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండలంలో ఉన్నటువంటి చక్రం పేట ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు పి. తిరుపాల్ ను డి ఈ వో కేవిఎన్ కుమార్ సస్పెండ్ చేసారు. సోమవారం ఖిఖి ప్రభాతవార్త ఖిఖి దిన పత్రికలో ఖిఖి ఆ టీచర్ పై చర్యలు తీసుకోవాలి అనే శీర్షికతో కథనం ప్రచురితమైనది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే మండల, జిల్లా విద్యా శాఖ అధికారులు పూర్తి వివరాలు పరిశీలించి ఉపాధ్యాయుడు పి.తిరుపాల్ ను సస్పెండ్ చేసారు.

భూత, సింహ వాహనాలపై సోమస్కంధమూర్తి

తిరుపతి, ఫిబ్రవరి 10ప్రభాతవార్త:
కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు మంగళవారం ఉదయం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మ సమేతంగా భూత వాహనంపై అభయమిచ్చారు.రాత్రి సింహ వాహనంపై కటాక్షించారు. ఈ వాహనసేవలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, అదికారులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

తొలిపూజలు కన్నప్పకు

(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)
శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం అంగరంగ వైభవంగా భక్తకన్నప్ప ధ్వజారోహణం జరిగింది.ఇక్కడి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాల్ని నిర్వహించటం ఆనవాయితిగా వస్తుంది. సాధారణంగా ఏ ప్రాంతంలో అయినా వార్షిక బ్రహ్మోత్సవాల్ని పదిరోజుల పాటు నిర్వహించటం జరుగుతుంది. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు బ్రహ్మోత్సవాల్ని నిర్వహించటం జరుగుతుంది.మొదటి పూజను భోళాశంకరుడు తనను మూఢభక్తితో ఆరాధించి తన కళ్ళను సైతం ఇవ్వటానికి సిద్ధపడ్డ భక్తుడు తిన్నడు అనే కన్నప్పకు అవకాశం కల్పించి భక్తుల పట్ల తన గుర్తింపుకు నిదర్శనంగా నిలిచారు.మంగళవారం మధ్యాహ్నం ఆలయంలో భక్తకన్నప్పను ఎంతోచక్కగా రాజేష్‌గురుకుల్ అలంకరించగా బోయిలు మేళ తాళాలు మంగళవాయిద్యాలతో మోసుకుంటూ కొండపైకి వెళ్ళారు. కొండపై భక్తకన్నప్ప గుడి వద్ద ప్రతిష్టించి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ కలశాన్ని ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అక్కడ నుంచి పూజల్ని ధ్వజస్థంభం వద్దకు చేర్చారు. ఇక్కడ బలిముద్దల్ని ఏర్పాటు చేశారు.వేదపండితులు అర్థగిరి సారధ్యంలో నాలుగువేదాల్ని పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు స్వామినాథన్ గురుకుల్ పూజలు జరిపారు. ధ్వజస్థంభంపై దేవస్థానం సమర్పించిన వస్త్రాన్ని ఆధిరోహింపజేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం హారతులు ఆఖండ హారతులిచ్చారు.నైవేద్యం సమర్పించారు. భక్తులు హర హర మహాదేవ శంభోశంకరా అంటూ నినాదాలు ఇస్తుండగా ధ్వజారోహణం జరిపారు. హారతులు, అఖండ హారతులిచ్చారు. ఎదురుగా ఉన్న ఈశ్వరలింగానికి హారతులిచ్చారు. తరువాత తేవారం పండితుడు ముత్తుకుమార్‌స్వామి పఠనంతో కార్యక్రమాలు ముగిసాయి.

ఆలయంలో పూజలు:
కొండపై వెలసిన భక్తకన్నప్ప విగ్రహానికి పూజలు,నైవేద్యం, హారతులిచ్చారు. కొండపై దిక్పాలకులకు ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమాలకు విశేష సంఖ్యలో పట్టణానికి చెందిన వేలాది మహిళలు హాజరయ్యారు. అలాగే అతిథులు కూడా విశేష సంఖ్యలు హాజరయ్యారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి,బాపిరెడ్డిడెప్యూటీ ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి ఇఇ శ్రీనివాసులురెడ్డి నవభారత్ యువజనసంఘం అధ్యక్షులు గరికపాటిరమేష్‌బాబు, ఎఇఒ మోహన్,విద్యాసాగర్‌రెడ్డి, హేమామాలిని, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుదర్శనం తదితరులు హాజరయ్యారు.

భక్తకన్నప్ప ఊరేగింపు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రమ్మోత్సవాలు సందర్భంగా మొదటి పూజలు అందుకున్న భక్తకన్నప్పపట్టణంలో ఊరేగింపు జరిపారు. ఊరేగింపుకు ముందు ప్రత్యేక గొడుగులు వెళుతుండగా వెనుకగా కోలాటాలు ఎంతో ఆకర్షించాయి. చెక్కభజనలు, మేళతాళాలు,మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు, వేదపండితుల వేదఘోషతో ఊరేగింపు త్రినేత్ర అతిథి గృహం, సన్నిధివీధి, తేరువీధి, బజారువీధి, నగరి వీధి,నెహ్రూవీధుల గుండా సాగింది. ఉత్సవంతో ఆలయాధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరునికి గొడుగులు సమర్పణ

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 10 ప్రభాతవార్త
దక్షిణ కైలాసంగా ఖ్యాతి గడుస్తున్న శ్రీ కాళహస్తీశ్వర ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజైన భక్తకన్నప్ప కొండపై కైలాసనాథ స్వామి ధ్వజారోహణము రోజున బ్రహ్మోత్సవాలలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి వాహన సేవలకు అలంకరించేందుకు చెన్నై హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ట్రస్టీ ఆర్.ఆర్ గోపాల్ జీ ఆధ్వర్యంలో ఐదు గొడుగులను శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ అధికారులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ చేతులు మీదుగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వర దేవస్థానానికి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేకంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటం తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ ఆర్. ఆర్ గోపాల్ జీ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి అనుగ్రహంతో గత 15 సంవత్సరాలుగా శ్రీకాళహస్తీశ్వర ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రియ భక్తుడైన భక్త కన్నప్ప కొండపై కైలాసనాథ స్వామి ధ్వజారోహణం రోజున ఈ గొడుగులను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏ ఈ ఓ మోహన్, విద్యాసాగర్ ట్రస్టీ బోర్డు సభ్యులు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం ఎంత ముఖ్యమో..ప్రజలపై అదనపు భారం మోపం

తిరుపతి నగరపాలక బడ్జెట్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి,ఫిబ్రవరి 10ప్రభాతవార్త:
శ్రీవారి పాదాల చెంత తిరుపతి ఉండటంతో టిటిడి, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల నుండి మరిన్ని ఎక్కువ నిధులు రాబట్టుకోవాలని తిరుపతి నగరపాలక కౌన్సిల్ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష సూచించారు. బడ్జెట్‌లో అంచనాలకు అనుగుణంగా రాబడి ఉంటేనే అభివృద్ధికి నిధులు మంజూరు కాగలవని, ఆదాయం ఎంత ముఖ్యమో ప్రజల పై అదనపు భారం పడకుండా వనరుల సాధన కోసం అన్వేషణ చేయాల్సిన అవసరం కూడా కౌన్సిల్, అధికారులపై ఉందన్నారు. తిరుపతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంకావున, భవిష్యత్తు నగర అభివృద్ధి అవసరమైన మౌలిక వసతుల కోసం మన ఆలోచనలు ఉండాలన్నారు. గత బడ్జట్ ప్రతిపాదనలు , ఖర్చు చేసిన

విధానం పై హేతుబద్ధమైన చర్చ చేసిబడ్జెట్ లో కీలకమైన అంశం ఆదాయం అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ చివరి ఐదవ బడ్జెట్ సమావేశాలను నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఎస్వీయూ సెనేట్ హాల్ లో ప్రారంభమయ్యాయి.. బడ్జెట్ సమావేశాన్ని మేయర్ డాక్టర్ శిరీష లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ....వరుసగా ఐదవ బడ్జెట్ ప్రవేశ పెట్టే కౌన్సిల్ కి మేయర్ గా ఉండే అవకాశం నాకు లభించినందుకు చాలా సంతోషంగా ఉంది.మీ అందరి సహకారంతోనే నాకు ఈ గౌరవం లభించింది. అందుకు వ్యక్తిగతంగా ప్రత్యేక అభినందనలు. చిన్న ఆశ అయితే ఉన్నింది.. అదే చివరి బడ్జట్ గ్రేటర్ తిరుపతి నగర బడ్జెట్ గా పెట్టే అవకాశం వస్తుందని. గ్రేటర్ ఆలస్యం అవుతున్నందుకు కొంత అసంతృప్తి ఉన్నా నాకు నమ్మకం ఉన్నది.. తదుపరి ఎన్నికలు మాత్రం గ్రేటర్ తిరుపతి నగర పాలక సంస్థకే జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నగరపాలక కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ళపై ప్రత్యేక దృష్టి

పటిష్టంగా జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ విధులు - కలెక్టర్ సుమిత్‌కుమార్

జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:
సంక్షేమ హాస్టళ్ళపై జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులతో సంక్షేమ హాస్టళ్ళలోని విద్యార్థుల ఆరోగ్య విషయాల తనిఖీపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్ సభ్యులు ప్రతిరోజు హాస్టళ్ళలో తనిఖీలు నిర్వహించి పిల్లల ఆరోగ్య విషయాలు, దినచర్యలపై నివేదికలను తనకు అందించాలన్నారు. జిల్లాలో ఏ హాస్టల్‌లో పారిశుధ్యంపై ఫిర్యాదు రాకుండా వుండాలన్నారు. ఎక్కడైనా హాస్టల్‌లో పారిశుధ్యంపై ఫిర్యాదు వస్తే సంబంధిత హాస్టల్ వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రమణ వ్యాధుల భారం రోజురోజుకు పెరిగిపోతుండటంతో సంక్ర మణ వ్యాధులపై రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం వన్‌హెల్త్ విధానంలో విభాగాల మధ్య సమన్వయంను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం వుందన్నారు. అధిక ప్రమా దం వున్న పాఠశాలలు, హాస్టళ్ళలో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. సంక్రమణ వ్యాధుల కట్టడి చేయడంలో వైద్య ఆరోగ్యశాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేణిగుంట తాహసిల్దార్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

రేణిగుంట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త
రేణిగుంట తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి అతి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. హ్యూమన్ రైట్స్ యాక్ట్ అమల్లోకి వచ్చి 50 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా మంగళవారం మంగళగిరినందు జరిగిన స్వర్ణోత్సవ సభా వేదుకల్లో చంద్రశేఖర్ రెడ్డి అవార్డు అందుకున్నారు. రేణిగుంట మండలంలో అనేక ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు వెట్టి చాకిరీలో మగ్గుతున్న విషయాన్ని గ్రహించి కుటుంబాలకు తాహసిల్దార్ విముక్తి కలిగించారు. ఈ నేపథ్యంలో ఆయనను విట్ (వీఐటి) ఆంధ్ర ప్రదేశ్ విశ్వవిద్యాలయం అవార్డుకు ఎంపిక చేసింది. రాష్ట్రం మొత్తం మీద రేణిగుంట తహసిల్దార్ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. అవార్డు అందుకున్న తాహసిల్దార్ ను పలు రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది అభినందించారు. విధి నిర్వహణలో ఒత్తిడిలకు గురి చేయకుండా చట్టబద్ధంగా విధులను నిర్వహించడానికి సహకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, ఇతర రెవిన్యూ ఉన్నతాధికారులకు తాహసిల్దార్ ధన్యవాదాలు తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- 'అబ్కారీ శాఖ స్పోర్ట్స్ డే'లో జె.సి.గోవిందరావు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త:

నిరంతరం ఉద్యోగ పని ఒత్తిడిలో వున్న అబ్కారీకి శాఖ ఉద్యోగులకు ఆట విడుపుగా క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మంగళవారం ఎస్వీ విశ్వవిద్యాలయ మైదానంలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్ డే కార్యక్రమం జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదగా ప్రారంభమైంది. ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, ఐక్యతను బలోపేతం చేయడం, క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 200మంది ఎక్సైజ్ శాఖ సిబ్బంది క్రీడలలో ఉత్సహంగా పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నీస్, క్వారమ్స్, టెన్నికోయిట్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వాల్ వంటి పలు క్రీడా విభాగాలలో సిబ్బంది ప్రతిభను కనబరిచి, అందర్ని ఆకట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ గోవిందరావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపోందించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు పరస్పర సహకారం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

ఏకాంబరకుప్పం
రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన

పుత్తూరు (నగరి), ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :
నగరి పట్టణంలో ఏకాంబరకుప్పం రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ పనులకు సంబం ధించి మంగళవారం చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కు మార్, చెన్నై రైల్వేఅధికారులతో కలిసి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ నగరి పట్టణంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఓవర్, అండర్ బ్రిడ్జి పను లకు సంబంధించి ఇప్పటికే డిజైన్‌లను రైల్వే అధికారులు ఆమోదించారు. అలాగే బ్రిడ్జిల నిర్మాణంలో భాగస్వామ్యమైన రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖకు డిజైన్‌లు అందించారు. ఈ విషయమై బ్రిడ్జిల మ్యాప్‌ల సహాయంతో క్షేత్ర స్థాయిలో పనులు ఎలా జరుగుతాయో ఎమ్మె ల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. పను లు త్వరితంగా ప్రారంభించి, పూర్తి చేయాలని అధికారులను కోరారు. రైల్వే అధికారులు మా ట్లాడుతూ 49వ నెంబరు రైల్వేగేట్ వద్ద రెండు మార్గాలతో ఆరు మీటర్ల వెడల్పుతో అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని తెలిపారు. అలాగే 1.5 కిలోమీటర్ల పొడవు, 7.50 మీటర్ల వెడల్పుతో రెండు వైపులా ఫుట్‌పాత్‌లతో ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు డిజైన్‌లు ఆమోదం పొందాయని తెలిపారు. ఈ రెండు బ్రిడ్జిల నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం రైల్వే శాఖ భరిస్తుందని తెలిపారు. భూసేకరణ పనులను వెంటనే ప్రారంభించాలని రెవెన్యూ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

రూ. 3 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణ

- సమాచారం ఇవ్వలేదని ముగ్గురు రెవెన్యూ సిబ్బందికి మెమోలు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త:
అనంతపురం చెన్నై జాతీయ రహదారిలోని రొంపిచెర్ల మండలం బండకింద పల్లె గ్రామపంచాయతీలో రూ. 3కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి అయింది. దీనిపై కమ్మెళ్ళ పల్లె, మాట్లోళ్ళ పల్లి గ్రామస్థులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో ఆక్రమణదారులు రెండు, మూడు రోజులుగా సర్వే నెంబర్ 36లో సుమారు 0.75 సెంట్ల భూమిని జెసీబీతో చదును చేసి చుట్టూ ముళ్ళు కంచెను ఏర్పాటు చేసి మామిడి మొక్కలు కూడా నాటేశారు. గత 20 రోజుల క్రితం అదే భూమిలో బడబళ్ళ వంక నుంచి ఎర్రబావనచెరువుకు పోతున్న సప్లై ఛానల్‌ను పూడ్చివేసి పది సంవత్సరాల క్రితం మామిడి చెట్లను నాటారని నీరు రావడం లేదని

రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో వారు సప్లై ఛానల్‌ను ఇరిగేషన్ ఏఈ మునిశేఖర్ పరిశీలించారు. అక్కడ సప్లై ఛానల్ ఆనవాలు కూడా లేకపోవడంతో సప్లై ఛానల్ గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు.ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవిన్యూ అధికారులు కొందరు ఆక్రమదారుడికి తొత్తుగామారిపోయారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సప్లై ఛానల్‌ను పునరుద్ధరణ చేసి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- ముగ్గురు రెవెన్యూ సిబ్బందికి మెమోలు: ఇంచార్జి తహసీల్దార్

ఆక్రమణకు గురి అవుతున్న బండకింద పల్లి వీఆర్వో సురేంద్ర వీఆర్ ఏలు ఇర్ఫాన్ అలీ, లక్ష్మణ్‌లకు మెమోలు ఇచ్చినట్లు ఇంచార్జి తహసీల్దార్ కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. సప్లై ఛానల్ ఆక్రమణకు గురైందని ఇరిగేషన్ అధికారులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఆక్రమణదారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలియజేశారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: చిత్తూరు నగరంలో దర్గా సర్కిల్-ఇరువారం రోడ్డు విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం పలమనేరు రోడ్డులో భవన యాజమానులను ఒప్పించి వారి యొక్క సొంత భవనాలను తొలగించారు. ఈ కార్యక్రమం అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర పర్యవేక్షణలో జరిగింది. దర్గా సర్కిల్ నుండి ఇరువారం వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా పూర్తి అయితే రోడ్డు విస్తీర్ణం మరింత పెరుగుతుందని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థినికి మంచి, చెడు తెలిసేలా అవగాహన

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: పాఠశాల, కళాశాల విద్యార్థినిలు ప్రతి ఒక్కరికి మంచి, చెడు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిత్తూరు బిఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర, ఎఎస్ఐ వెంకటేశులు విద్యార్థినిలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహ నిరోధక చట్టం, సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదర్థాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లా డుతూ విద్యార్థినిలు చిన్న వయస్సులోనే మంచి-చెడుపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఎవరైనా అనవసరంగా తాకితే, మీకు అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నో చెప్పి నమ్మకంగా వున్న గురువు లేదా తల్లిదండ్రులకు విషయంను చెప్పాలన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, చిన్న వయస్సులోనే వివాహం జరిగితే ఆరోగ్య సమస్యలతో పాటు భవిష్యత్తు దెబ్బ తింటుందన్నారు. బాలికల కోసం ప్రభుత్వం శక్తియాప్‌ను సిద్ధం చేసిందని, ఎలాంటి ప్రమాదం ఎదురైనా ఈ యాప్‌లో సులభంగా పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ మళ్ళింపు

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: చిత్తూరు-సిద్ధంపల్లి రైల్వేస్టేషన్‌కు మధ్య వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించి ఓవర్‌హాలిక్ పనులను రైల్వేశాఖ చేపట్టనుండటంతో మెసానికల్ గ్రౌండ్‌కు సమీపంలో వున్న రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ మళ్ళింపుకు చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఫిబ్రవరి 12 నుండి 15వ తేదీ వరకు ఈ పనులు జరుగుతాయని, ఈ సమయంలో వాహనాలను తాత్కాలికంగా నిలుపుదల చేసి, ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్ళించడానికి ప్రయత్నాలు చేపట్టడం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు.

బాధ్యతాయుతంగా ఇంటర్నెట్ వినియోగం

– జిల్లా ఎన్ఐసి అధికారి ఎన్.వెంకటేశ్వరరావు

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఇంటర్నెట్‌ను సురక్షితంగా, బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరు వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ సెక్యురిటీ, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎన్ఐసి అధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా, సురక్షితంగా వినియోగించడంపై అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి రెండవ మంగళవారం 'సేఫర్ ఇంటర్నెట్ డే' ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. పిల్లలు, యువత, ఆన్‌లైన్‌లో ఎదుర్కొనే సవాళ్ళు, భద్రతా అంశాలపై అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం అన్నారు. అలాగే ప్రతి ఏడాది ఇంటర్నెట్ వినియోగంలో ఉద్భవిస్తున్న కొత్త సమస్యలు, ప్రస్తుత ఆందోళనలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం సేఫర్ ఇంటర్నెట్ డే ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటి మేనేజర్ కె.రమేష్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యలో నాణ్యత పెంపు

చిత్తూరుహెల్త్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: వైద్య విద్యలో నాణ్యత పెంపు, పరిశోధనల్లో స్వతంత్రత, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవస్థ బలోపేతం చేయడం కీలకమని దేశ ప్రఖ్యాత వైద్య శాస్త్రవేత్త, పద్మవిభూషన్ ప్రొఫెసర్ ఎస్‌కె గంగూలి అన్నారు. ప్రొఫెసర్ ఎస్‌కె గంగూలి మంగళవారం అపోలో నాలెడ్జ్ సిటీని సందర్శించి పరిశోధన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీజెనరేటివ్ మెడిసిల్ వంటి ఆధునిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే రెగ్యులర్ ఇండస్ట్రీ భాగస్వామ్యాలు అవసరమని సూచించారు. ప్రతి పరిశోధకుడు తన పరిశోధనకు స్వతంత్ర్య బాధ్యత వహించాలని, పిజీ కోర్సులు బలంగా వుండటం, యువ అధ్యాపకులను ప్రోత్సహించడం, పిహెచ్‌డి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ అపోలో నాలెడ్జ్ సిటీలో విద్యార్థుల సంఖ్య 2 వేల నుండి 5,500 మందికి చేరిందని, ఇక్కడ 8, 9 వేల మంది విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పోతురాజు, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టీన్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

22న బిసీ సింహగర్జన విజయవంతంకు పిలుపు

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: నాగార్జున యూనివర్సిటీలో భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో ఈన ఎల 22వ తేదీన జరుగనున్న బిసీ సింహగర్జన కార్యక్రమంను బిసీలందరు హాజరై విజయవంతం చేయాలని పూతలపట్టు బిసివై పార్టీ అధ్యక్షులు ఓంప్రకాష్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిసీలకు జరుగుతున్న అన్యాయంను, బిసీలను అణగదొక్కుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు ఎత్తుచూపడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ బిసీ సింహ గర్జన కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా వున్న 120 మంది బిసీ నాయకులు హాజరు కానున్నారన్నారు. జిల్లాలోని బిసీలందరు ఈ కార్యక్రమంకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.బిసీ నాయకులు శ్రీహరియాదవ్, జగదీష్, కుమార్ యాదవ్, ఉదయ్ యాదవ్, శోభన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ట్రాఫిక్ నిబంధనలు అమలు

పెనుమూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా పాటించాలని లేకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఎస్ఐ శ్రీనివాసులు ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలకు సంబంధించి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా వుండాలని, పాఠశాల విద్యార్థులను ఆటోల్లో జాగ్రత్తగా తీసుకెళ్ళాలని స్పష్టం చేశారు. అలాగే మద్యం సేవించి ఆటోలు నడుపరాదని, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ పడితే అక్కడ ఆటోలను పార్కింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే ఆటోలో ఓవర్ లోడ్ వేసుకుని వెళితే సీజ్ చేస్తామన్నారు.

రైల్వే కోడూరు డివిజన్

పోలీస్ పై దౌర్జన్యం కేసులో ఒకరు అరెస్టు

పుల్లంపేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :మండల కేంద్రమైన పుల్లంపేటలో ఆదివారం రాత్రి నాగుల పూరి గట్టు వీధిలో నివాసం ఉంటున్న నాగా తిమ్మా రెడ్డి ఇంటిదగ్గర కోనయ్యగారి పల్లి గ్రామానికి చెందిన చలమల మల్లికార్జున రెడ్డి అను వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు ఈ విషయమై భయభ్రాంతులకు గురైన నాగ తిమ్మారెడ్డి పుల్లంపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకునేసరికి మద్య మత్తులో ఉన్న చలమాల మల్లికార్జున రెడ్డి పోలీసులపై తిరగబడి హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాజు చేతివేళ్లను కొరికి తీవ్ర రక్తస్రావం అయ్యేటట్లు గాయపరిచి హంగామా సృష్టించాడు ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ కు విధించారు నిందితుడిని రాజంపేట సబ్ జైలుకు తరలించారు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం.

చిట్వేలి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు కార్మిక సంఘాలు మంగళ వారం రెవెన్యూ కార్యాలయం ఎదుట కరపత్రాలను విడు దల చేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు పందికాళ్ళ మణి, వీఆర్ఏ డివిజన్ కార్యదర్శి కొరముట్ల సుధాకర్లు మాట్లాడుతూ రైతులు, కార్మిక, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు ఈ సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాలుగు కార్మిక చట్టాలను రద్దుతో పాటు,కనీస వేతనం 26000 ఇవ్వాలన్నారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంట రుణాలు, పండిన పంటకు గిట్టుబాటు ధర, పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి రక్షణతో పాటు పని దినాలు 200 రోజులకు పెంచి 600 రూపాయల కనీస వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుప్పంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం

– కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో స్వచ్ఛకుప్పం సాధనలో భాగంగా కుప్పం మున్సిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. 75మైక్రోన్ల కంటే తక్కువ ఉన్నప్లాస్టిక్‌ను వాడరాదన్నారు. బయోడిగ్రీ లెవెల్ ప్లాస్టిక్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించాలని సూచించారు. ఈప్లాస్టిక్ ఉత్పత్తులను స్థానిక మున్సిపల్ కార్యాలయం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద విక్రయాలకు ఉంచడం జరిగిందన్నారు. వ్యాపారులు, దుకాణదారులు బయోడిగ్రీ లెవెల్‌ను ప్లాస్టిక్‌ను వినియోగించాలని సూచించారు. మామూలు ప్లాస్టిక్ వాడితే, అమ్మితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అలాగే దుకాణదారులు 2026-27సం॥కుగాను వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులను ఈనెల 28వతేది లోగా మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని కమీషనర్ కోరారు.

మహిళ ఉరేసుకుని ఆత్మహత్య

రామకుప్పం, ఫిబ్రవరి10 ప్రభాతవార్త మండలంలోని కెంచనబళ్ల గ్రామంలో ఓ వివిహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన ఆనందరావు భార్య శిల్ప(33) స్థానిక పెద్ద చెరువు సమీపంలో తన చీరతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం ఇది గమనించిన చుట్టుపక్కల గ్రామస్తులు కెంచనబళ్లవాసులకుసమాచారంఇచ్చారు.మృతురాలిసోదరుడువిజయ్‌కుమార్ ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలికిచేరుకునిపరిశీలించారు.మృతదేహాన్నిపంచనామాకైకుప్పంఆస్పత్రికితరలించికేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ

రామకుప్పం, ఫిబ్రవరి10 ప్రభాతవార్త స్థానిక బాలుర భవిత పాఠశాలలో చదువుతున్న కృష్ణరాజపురంకు చెందిన విద్యార్థి నరేష్ చిత్తూరు జ్యోతిరావ్‌పూలే భవనంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో అలరించి జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అతన్ని ఘన ంగా సత్కరించారు.

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకే సిఎంఆర్ఎఫ్

– టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్

శాంతిపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త అప్పులు చేసి వైద్యం చేసుకుని కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకే సిఎం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 29మందికి మంజూరైన 43లక్షల రూ.ల చెక్కులను నేరుగా బాధితుల నివాసాల వద్దకే వెళ్లి అందించారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, విశ్వనాథనాయుడు, ఎల్.జయరాంరెడ్డి, మణి, చంద్ర, గోపాల్, శివ, సురేష్,శేఖర్, బసవరాజు, చంద్రకళ, రాజు, హరినాథ్‌రెడ్డి, శివ, సింగిరి శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

పుష్పపల్లకికి భారీ బందోబస్తు..ట్రాఫిక్ మళ్లింపు : సిఐ

వి.కోట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త స్థానిక శ్రీ ఆంజనేయస్వామి పుష్పపల్లకి సందర్భంగా పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. యువత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదని హెచ్చరించారు. మద్యం తాగి గొడవలు చేయడం, డిజె సౌండ్స్‌తో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదన్నారు. అన్ని కూడళ్లల్లో బందోబస్తు ఏర్పాటుచేయడంతోపాటు డ్రోన్లు, సిసి కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. పాతనేరస్తుల్ని బైండోవర్ చేశామన్నారు. బుధవారం సాయంత్రం ఐదుగంటలనుంచి గురువారం ఉదయం ఐదుగంటల దాకా ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు సిఐ తెలిపారు. కుప్పం నుంచి వచ్చే వాహనాలు పట్రపల్లి, నక్కనపల్లి మీదుగా జవునిపల్లి క్రాస్‌కు చేరుకోవాలన్నారు. పలమనేరు నుంచి వచ్చే వాహనాలు అంబేద్కర్ సర్కిల్‌నుంచి పేర్నంబట్ రోడ్డులో బైరుపల్లి క్రాస్, అన్నవరం క్రాస్‌మీదుగా మళ్లిస్తామన్నారు. కెజిఎఫ్ వెళ్లే వాహనాలు కస్తూరి నగరం నుంచి వెళ్తాయన్నారు.

డంపింగ్‌యార్డులో చెత్త తొలగింపుకు చర్యలు

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డంపింగ్‌యార్డులో చెత్త తొలగింపుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. చెత్తను వేరు చేసి శుభ్రం చేసేందుకు భారీ యంత్రం సైతం కుప్పం చేరుకుందన్నారు. త్వరలోనే పనులు మొదలుపెడతామని కమీషనర్ తెలిపారు. ఇప్పటికే ప్రతి ఇంటి నుంచి తడి,పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తున్నట్లు చెప్పారు.

జిల్లా షూటింగ్‌బాల్ సబ్‌జూనియర్ జట్ల ఎంపిక

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ఈనెల 12వతేది రామకుప్పంలోని డా॥ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ బాల,బాలికల జట్లను ఎంపిక చేయడం జరుగు తుందని జిల్లా షూటింగ్ బాల్ ఛైర్మన్ మహేష్, అధ్య క్షుడు పవన్ కళ్యాణ్, ప్రిన్సిపాల్ రజనీకుమార్ తెలి పారు. 01-4-2010తర్వాత జన్మించిన క్రీడాకారులు పోటీలకు అర్హులన్నారు. వారివెంట ఒరిజినల్ ఆధార్‌కార్డు తేవాలని ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 14,15తేదీల్లో పల్నాడులో జరిగే రాష్ట్రసా థ్థయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9618330565,6301831236నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రంజాన్ పురస్కరించుకుని ముస్లీం ఉద్యోగులకు గంట ముందస్తు అనుమతి

చిత్తూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ముస్లీంల రంజాన్ మాసం పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ముస్లీం ఉద్యోగులకు సాయంత్రం పనివేళలు ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే ప్రార్థనల నిమిత్తం బయటకు వెళ్ళడానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే ముస్లీం ఉద్యోగులందరికీ

పారిశుద్ధం పట్ల శ్రద్ధ వహించండి:: డిపిఓ సుశీల దేవి

రైల్వేకోడూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

రైల్వే కోడూరు పట్టణంలో పారిశుద్ధం పట్ల అందరూ ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని తిరుపతి డిపిఓ సుశీల దేవి అన్నారు. మంగళవారం రైల్వేకోడూరు పట్టణం లోని పంచాయతీ కార్యాలయాన్ని మరియు సిబ్బంది తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీల దేవి మాట్లాడుతూ పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పూర్తి స్థాయిలో పరిశుభ్రపరిచి బ్లీచింగ్ మరియు పలు రకాల పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా విధుల పట్ల కూడా జాగ్రత్తలు పాటించి ముఖ్యంగా రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్ను, నీటి పన్ను తదితర బిల్లుల పట్ల సిబ్బంది జాగ్రత్తగా రాబట్టాలని అట్లా వసూలు చెయ్యని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్యం పట్ల డిపిఓ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో జయశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ దొంగ అరెస్ట్ ::

రైల్వేకోడూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

రైల్వే కోడూరు మండలంలోని రాఘవరాజుపురం రాచపల్లి గ్రామానికి చెందిన చమర్తి అనసూయమ్మ ఏపిఎండిసి మంగంపేట నందు అటెండర్ గా పనిచేస్తున్న సందర్భంలో ఆమె కుమారుడు హైదరాబాదు నుండి సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తూ అక్కడే ఉండగా ఆమె ఒక్కటే ఉన్న సందర్భంలో ఇంట్లో పనిచేస్తున్న రాఘవరాజుపురం హరిజనవాడకు చెందిన చెన్నమ్మ అనే మహిళ గత మూడు సంవత్సరాలుగా అనసూయమ్మ ఇంట్లో పనులు చేస్తూ ఉండేదని రైల్వే కోడూరు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. చెన్నమ్మ అనసూయమ్మ ఇంట్లో పని చేసుకుని తిరిగి ఇంటికి పోతున్న సమయంలో అనసూయమ్మకు చెందిన చైను, ఉంగరం ఉన్న కవర్ బ్యాగును పొరపాటున చెన్నమ్మ తన ఇంటికి ఎత్తుకొని పోవడంతో అనసూయమ్మకు కొంచెం వచ్చిన అనుమానాన్ని ఫోన్ ద్వారా చెన్నమ్మకు ఫోన్ చేసి అన్నం ఉండే కవర్ తీసుకెళ్లకుండా చైను, ఉంగరం ఉండే కవర్ను పట్టుకెళ్ళావని వెంటనే తన కవర్ ఇంటికి తెచ్చి ఇవ్వమని అనసూయమ్మ చెన్నమ్మకు ఫోన్ ద్వారా తెలియజేసింది. అయితే బంగారం తెచ్చిన కవర్ను చెన్నమ్మ మనవడైన పాలేటి మురళి అనే యువకుడు చెన్నమ్మ కు తెలియకుండా కొట్టు వేయడంతో సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎటికేలకు సీఐ చంద్రశేఖర్ రంగప్రవేశం చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఎటికేలకు అనసూయమ్మ బ్యాగులోని బంగారు వస్తువులను అమ్మేందుకు సిద్ధంగా ఉంచుకున్న మురళి ని కోడూరు పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ వద్ద ఉండగా పోలీసులు నిందితున్ని పట్టుకొని నాలుగు లక్షలు విలువ చేసే బంగారాన్ని స్వాధీనపరచుకొని నిందితుని రిమాండ్ కు తరలించినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

నిర్మాత బండ్లగణేష్‌ను కలసిన కంచర్ల శ్రీకాంత్ !!

– పాదయాత్రకు సంఘీభావం.. ఘన సత్కారం

కుప్పం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేష్‌ను మంగళవారం ఉదయం ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కలిశారు. హైదరాబాద్‌నుంచి తిరుమల దాకా పాద యాత్ర చేస్తూ బండ్ల గణేష్ తిరుపతి అలిపిరి మండపం వద్దకు రాగా ప్రభుత్వవిప్ డా॥ శ్రీకాంత్ ఆయనను కలసి సంఘీభావం పలికారు. సిఎం చంద్రబాబునాయుడును గత ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడానికి ఆవేదన వ్యక్త్ం చేయడంతో పాటు ఆయన ఆరోగ్యంగా ఉండాలని 2024 ఎన్నికల అనంతరం చంద్రబాబు సిఎంగా బాధ్యతలు చేపట్టాక హైదరాబాద్ -తిరుమల పాదయాత్ర చేపట్టి తిరుమల శ్రీవారిని దర్శించుకుంటానని మొక్కు చేసుకున్న బండ్ల గణేష్ తనపాదయా త్ర పూర్తి చేయడం పట్ల హర్ష్ం వ్యక్తం చేశారు. ఇది సిఎం చంద్రబాబునాయుడుపై బండ్ల గణేష్‌కు ఉన్న అభిమానానికి నిదర్శనమనిడా॥ శ్రీకాంత్ పేర్కొన్నారు.అంతకుముందు ఆయన బండ్ల గణేష్‌ను ఘనంగా సత్కరించారు.

గంగమ్మ భక్తులకు మరింత సులభతరంగా స్కానర్లు

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 10 ప్రభాతవార్త శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో వివిధ రకాలకు చెందిన సేవలను మరింత సులభతరంగా స్కానర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం అన్నారు. ఈమేరకు మంగళవారం కొండపై బ్యాంకు మేనేజర్‌తో కలసి సిబ్బంది ఆధ్వ ర్యంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన గోడపత్రికలను ఆవిష్కరించారు. దేవస్థానం సాధారణ ఖాతాతోపాటుగా గోశాల, అన్నదానానికి సంబంధించిన స్కానర్లను పొందపరచినట్లు ఆయన వివరించారు. గతంలో భక్తులు విరాళాలందించేందుకు ఫోన్‌పే చేయడంలో ఇబ్బందులు పడేవారనీ, ఇకపై నేరుగా వారే చేసుకోవచ్చునని ఏకాంబరం వివరించారు. ఈ అవకాశాన్ని అమ్మవారి భక్తులు వినియోగించుకోవాలన్నారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

12న పరికిదొన ఆవులపబ్బం

చౌడేపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త మండలంలోని పరికిదొనలో ఈనెల 12, 13తేదీల్లో ఆవులపబ్బం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా మండలంలోని పరికిదొన, గడ్డంవారిపల్లి, శింగిరిగుంట, నుంజార్లపల్లి, నూనెముద్దనపల్లి, కంపల్లి మరో 7గ్రామాలకు చెందిన ప్రజలు సంక్రాంతి పండుగను జరుపుకోరు. శివరాత్రికి ముందు వచ్చే గురు, శుక్రవారాల్లో సంక్రాంతిని తలపించేలా ప్రతిష్టాత్మకంగా ఆవులపబ్బాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రాంత ప్రజలు ఆవులపబ్బంలో కాటమరాజును ఆరాధించడం గమనార్హం.

కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుంది

సోమల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు సంఘ అధికార ప్రతినిధి సోమల సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఏఎంసి ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు

తిరుపతి డివిజన్

పుత్తూరులో గోడపత్రికఆవిష్కరణ

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి పుత్తూరులో గోడపత్రిక ఆవిష్కరణ సందర్భంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్నారు. మంగళవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కారు 29 కార్మిక చట్టాలు రద్దుపరచి నాలుగు లేబరు కోడ్‌లు తీసుకువచ్చిందని దీని వల్ల కార్మిక వర్గం సమ్మె చేసే హక్కును సంఘం పెట్టుకుని హక్కును కనీస వేతనాలను పనిగంటల హక్కుని కోల్పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డివిజన్ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శుల గోపి చంద్రబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.హేమావతి, జిల్లా సమితి సభ్యులు మహేష్, నాయకులు చంద్రశేఖర్, శరవణ, మేస్త్రి కృష్ణారెడ్డి, రమేష్, రామతులసి, నవీన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విజయపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: నగరిలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రిఫరెన్స్ లెటరు ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్ఎఫ్) చెక్కులను నగరి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐఏఎస్ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వివిధ కారణాల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన కుటుంబాలకు ఎమ్మెల్యే రిఫరెన్స్‌తో ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అవసరంలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సకాలంలో సహాయం అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యేతో పాటు సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే క్యాంప్లో ప్రతిభ చూపిన క్యాడెట్స్‌కు సన్మానం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ఢిల్లీ వేదికగా గత నెల 28న జరిగిన రిపబ్లిక్ డే క్యాంప్ 2028లో ప్రతిభ చూపి ప్రతిష్టాత్మక మెడల్స్ సాధించిన ఎస్వీ ఆర్స్ కళాశాల ఎన్సీసీ విద్యార్థులకు ఘన స్వాగతం లభించింది.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో ఘనంగా స న్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మ రిపబ్లిక్ డే క్యాంప్ డ్రెసేజ్ విభాగంలో కళాశాలలో బీకాం థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బి ఆనంద్ సిల్వర్ మెడల్ సాధిం చగా,టి త్రివేణి బ్రౌంజ్ మెడల్ సాధించారని తెలిపారు. జాతీయ స్థాయిలో కళాశాల పేరుప్ర తిష్టలను ఇనుమడింపజేసిన విద్యార్థులు అభినందనీయులన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ ఓ పరుషో త్తమ నాయుడు, అధ్యాపకులు భీమన్న పాల్గొని విద్యార్థుల ప్రతిభ కళాశాలకు గర్వకారణమని కొనియా డారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలు రేపు

తిరుపతి విద్య ఫిబ్రవరి 10 ప్రభాత వార్త

ఎన్టీఏ ఆధ్వర్యంలో గత నెల 21 నుంచి 29వ తేదీవరకు పది రోజుల పాటు జరిగిన జేఈఈ మెయిన్స్ సెషన్1 పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేయనున్నట్లు ఎన్టీఏ తెలిపింది. జిల్లా నుంచి సెషన్ 1 పరీక్షలకు సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. సెషన్2 పరీక్షల దరఖాస్తుల గడువు ఈనెల 25తో ముగియనుంది. ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీవరకు సెషన్2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎన్టీఏ అధికారులు షెడ్యూల్ను ప్రకటించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ రూ. 7.46 లక్షలు పంపిణీ

పుత్తూరు (నగరి), ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడు తున్న పది మంది బాధితులకు మొత్తం రూ. 7,46,496 లక్షలను నగరి పట్టణంలో మంగళ వారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్, కలెక్టర్ సుమిత్ కుమార్‌లు ఇద్దరూ చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. నగరికి చెందిన లోకేష్‌కు రూ. 2,67,406 లక్షలు, సి.రాజ్యలక్ష్మికి రూ. 30,000 వేలు, ఇ.పెరుమాళ్‌రెడ్డికి రూ. 1,17,226 లక్షలు, డి.శ్రీనివాసన్‌కు రూ. 64,584 వేలు, వి.ఆర్.తి రునావక్కరుసుకు రూ. 36,084 వేలు, కె.సి.మీరాకు రూ. 10,157 వేలు, ఎస్.డి.సంతోష్‌కు రూ. 26,218 వేలు, జి.ప్రసాద్‌కు రూ. 15,413, ఎం.జీవరత్నంకు రూ. 1,24,236 లక్షలు, వి.లియా నాకు రూ. 55,172 వేలు అందించారు.

సమిష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దాం

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 10,"ప్రభాతవార్త

సమిష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. మంగళవారం వరదయ్య పాలెం ఎంపిడిఓ కార్యాలయం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు దిశ నిర్దేశం చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా తమ ప్రగతి నివేదికను అధికారులు సభలో చదివి వినిపించారు. సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

– సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమి పూజ.. వరదయ్య పాలెం మండలం గోవర్ధన పురం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా పల్లె పండుగ 2.0 ద్వారా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉదయం భూమి పూజ చేశారు. అనంతరం ఇందిర నగర్‌కు ఎమ్మెల్యే చేరుకొని జడ్పీ హైస్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. .

గంగమిట్ట సదవాలమ్మ గుడి వద్ద గ్రిల్స్ ధ్వంసం

సత్యవేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: సత్యవేడు మండల పరిధిలో అక్రమ గ్రావెల్ మట్టి తరలిస్తున్న టిప్పర్ గంగమిట్ట వద్ద సదవాలమ్మ గుడి గ్రిల్స్‌పై దూసుకెళ్లింది. మంగళవారం ఉదయం సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో డ్రైవర్ నిర్లక్ష్య ధోరణితో గుడి గ్రిల్స్‌ని ఢీకొనడంతో గ్రామస్తులు ఆగ్రోశానికి గురై రోడ్డుపైనే బైఠా యించారు. గుడి వద్ద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వారు తెలిపారు. విష యం తెలుసుకున్న ఎస్ఐ సాయినాథ్‌చౌదరి గ్రామస్తులతో మాట్లాడి నిరసనను విరమించారు. అనంతరం ఈ మట్టి మాఫియా అడ్డుకోవాలని స్థానిక జుడిషనల్ న్యాయమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లాయర్‌గోపి, రాధయ్య, హేమభూషణం, రాము, నాగలమ్మ, కుమార్‌నాయుడు, పయణి, శివనందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం



తొట్టంబేడు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త నాడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయటమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు.గ్రామాల సంక్షేమం సదుపాయాలు కల్పించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఈ మేరకు గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దటమే లక్ష్యంగా పని చేస్తామని ఎంఎల్ఏ అన్నారు. తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి గ్రామానికి సెవెంత్ బ్రాంచ్ తెలుగు గంగ పైన స్మశానానికి చిన్న బ్రిడ్జి వేయడం వల్ల మనిషి చనిపోతే మృతదేహాన్ని తీసుకెళ్లడానికి భయభ్రాం తులతో బ్రిడ్జి దాటుకుని మృతదేహాన్ని పూడ్చేవాలమని, పొరపాటున కాలు జారితే కాలవలో పడే వాళ్ళమని, గతంలో ఇద్దరు చనిపోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ ముందు మాజీ మంత్రి దివంగత గోపాలకృష్ణారెడ్డి తనయుడు బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి గ్రామస్తులు ఈ సమస్యను తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చొరవతో కనపర్తి గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం మండల అధ్యక్షుడు రావిళ్ళ .మునిరాజా నాయుడు అధ్యక్షతన ప్రారంభోత్స వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, మండల అధ్యక్షుడు మునిరాజా నాయుడు , కన్నలి. ప్రతాప్ రెడ్డి, అక్షింతల కృష్ణ యాదవ్, ఎంపీడీవో పి సురేంద్రనాథ్,అధికారులకు కల్లిపూడి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

జాతీయ మాంస పరిశోధన సంస్థ, పశువైద్య కళాశాల సంయుక్తంగా నిర్వహించిన కిసాన్ మేళాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ విభాగాల స్టాల్స్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు.వ్యవసాయ అనుబంధ రంగాల్లో టెక్నాలజిని ఉపయోగించుకుని రైతుల ఆదాయం రెట్టింపుకు కిసాన్ మేళాలు ఎంతో ఉపయోగ పడతా యని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. జె.వి. రమణ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలు గురించి వివరించి రైతులకు ఎల్లపుడు అండగా ఉంటామని తెలియ చేశారు. ఈ కార్యక్రమానికి విస్తరణ అధికారి డా శోభమణి అధ్యక్షత వహించి రైతులకు వివిధ స్టాళ్లను సందర్శించి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దాదాపు750 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాంస పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా బసవారెడ్డి మాట్లాడుతూ ఈ కిసాన్ మేళాలో సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు అధిక రాబడిని, విలువ ఆధారిత ఉత్పత్తులతో లాభం పొందవచ్చని తెలియచేసారు. ఈ కిసాన్ మేళాకి డా పి. జగపతి రామయ్య చైర్మన్‌గా వ్యవరించారు.

బంగారమ్మ ఆలయంలో తులాభారం

కార్వేటినగరం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మ ఆల యంలో తులాభారం జరిగింది.కార్వేటినగరం లోని బి.సి.కాలనీకి చెందిన రూపేంద్ర,మనీషలకు చెందిన ఇద్దరు బిడ్డలకు తులాభారం వేయడం జరిగింది. మొదటి బిడ్డయిన దేవాన్క్షి 3సంవత్సరాల బిడ్డ 10కేజీల అరటిపండ్లు, రెండవబిడ్డ వేదంక్షి 2సంవత్స రాలు 9కేజీల బెల్లం తులాభారం వేయడం జరిగింది. అరటిపండ్లను భక్తులకు పంచిపెట్టడం జరిగింది. బెల్లం మాత్రం మరుసటి మంగళవారం పొంగళ్ళు చేసి భక్తులకు పంచనున్నట్లు ఆలయఅధ్యక్షులు కొప్పేటిప్రసాద్ తెలిపారు.ఆలయ వెంట శ్రీ సుబ్రమణ్యంస్వామి ఆలయ చైర్మన్‌రామిశెట్టి రాజశేఖర్,కుమార్,జీరాల రమేష్,భక్తులు పాల్గొన్నారు.

పింఛన్ ఇవ్వండి మహా ప్రభో...

కేవీబీ పురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని పాతపాళెంలో సిమెంటు రోడ్డు భూమిపూజని ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలంను ఎం.సురేష్ అనే వికలాంగుడు తనకు పింఛన్ రావడంలో ప్రభుత్వం జాప్యం చేసిందని నాకు 80 శాతం సదరన్ సర్టిఫికెట్ పొంది ఉన్నానని పైగా వికలాంగుడిగా ఉన్నానని ఎమ్మెల్యే దృష్టికి తెలిపాడు. దీంతో ఎమ్మెల్యే ఎంపీడీవో అధికారులను పిలిపించి తక్షణం వికలాంగునికి పింఛన్ వచ్చే విధంగాచర్యలు తీసుకోవాలని వారికి తెలిపారు. వికలాంగుడు సురేష్ మాట్లాడుతూ జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వోకి వినతులు కూడా అందజేశానని, ఇంత వరకు స్పందనలేదని తన తోడును ఎమ్మెల్యేకి తీసుకొచ్చాడు. ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులు తక్షణం పింఛన్ సదుపాయం కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రగతి ప్రోత్సాహకానికి 69మంది ధరఖాస్తులు .

తిరుపతి విద్య ఫిబ్రవరి 10 ప్రభాత వార్త పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవడం పేద విద్యార్థులకు భారంగా మారింది. ఆర్థిక పరమైన ఇబ్బందులతో గ్రామీణ, పట్టణ పేదలు టెక్నికల్ ఎడ్యుకేషన్కు దూరమవుతున్నారని కేంద్రప్రభుత్వం గుర్తించింది. ఇంజనీరింగ్, డిప్లొమో విద్యార్థులకు ప్రోత్సాహం అందించేలా ప్రతిభగల వారిని గుర్తించి ప్రగతిఖి పథకం పేరుతో ఉపకార వేతనాలు అందిస్తోంది. పాలిటెక్నిక్ కోర్సులో చేరే విద్యార్థులకు తొలి ఏడాది నుంచి ఉపకారవేతనాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. 10వ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా డిప్లొమో తొలి ఏడాది ఉపకార వేతనం అందిస్తారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులకు ఆయా సంవత్సరాలలో సాధించిన మార్కుల ఆధారంగా ఏడాదికి రూ.50వేలు చొప్పున అందజేస్తారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో చదువుతున్న విద్యార్థులు 202528 సంవత్సరానికి గాను ప్రగతి ఉపకార వేతనాలకు 69 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 2023 24 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది సుమారు 17 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50వేలు ప్రగతి ఉపకారవేతనాలు అందుతున్నాయని కళాశాల అధికారులు తెలియజేశారు.

సన్మానం

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 10 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ, గౌరవ అధ్యక్షులు రెడ్డివారి గురువారెడ్డి శ్రీకాళహస్తి లోని వారి కార్యాలయములో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శ్రీకాళహస్తి కోవా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు .నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సంఘః అధ్యక్షులు కొత్తపట్నం.మహేంద్ర సభ్యులు సి.వెంకట ముని ,పి సుబ్రహ్మణ్యం, కే మురళి అదేవిధంగా తిరుపతికి చెందిన జై చంద్ర నరేష్ సత్కరించారు.

సార్వత్రిక సమ్మెకు లారీ ఓనర్ల మద్దతు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ఈ నెల 12న జరగనున్న సార్వత్రిక కార్మిక సమ్మెకు శ్రీకాళహస్తి, తొట్టంబేడు, శ్రీకాళహస్తి తాలుకాల ఓనర్ల సంఘం తమ సంఘీ భావాన్ని ప్రకటించారు.ఈ మేరకు మంగళవారం సమావేశం అయి సార్వత్రిక సమ్మెలో న్యాయమైన అంశాలున్నందువల్ల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించాలని తీర్మానించారు. నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యం కావాలని ప్రమాదకర కేంద్ర చట్టాల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ మేరకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, లారీ ఓనర్ల సంఘం అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి జయశంకర్, కోశాదికారి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకారమ్మకు అభిషేకాలు

ఏర్పేడు,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త ఏర్పేడు మండలం గుడిమల్లంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు గ్రామదేవత ఏకారమ్మకు అభిషేకాలు నిర్వహించే సంప్ర దాయం ఉంది.ఈ నేపథ్యంలో మంగళ వారం గ్రామదేవత ఏకారమ్మకు స్థానిక సంప్రదాయం మేరకు అభిషేకాలు జరిపారు. అమ్మవారికి అభిషేకాలు జరిపి అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు పర్యవవేక్షణలో నిర్వహించారు. ఉభయదాతలు సునీల్ కిషోర్ వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మెన్ రామచంద్రారెడ్డి పర్యవేక్షించారు.

ప్రమాదాల మధ్య కార్పొరేట్ పాఠశాల: పట్టించుకోని అధికారులు

తొట్టంబేడు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని ఓ కార్పొరేట్ పాఠశాల ప్రమాదాల మధ్య నిర్వహిస్తున్నారు. అయితే ఈ ప్రమాదాలకు సంబంధించి అధికారులకు తెలియనిది కాదు. కానీ ఎందుకో పట్టించుకోవటం లేదు.పిల్లలను విద్యావంతులుగా తీర్చి దిద్దుటకు తల్లిదండ్రులు వేలు,లక్షలు లెక్కచేయక కార్పొరేట్ పాఠశాలలకు ఎంపిక చేస్తూ పంపుతున్నారు.అయితే అక్కడ పరిస్థితిని పరిగణలోకి తీసుకోవటం లేదు. దాంతో కార్పొరేట్ పాఠశాలల ఇష్టారాజ్యంగా మారుతుంది. కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు ఎందుకో సంపాదనే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యత ఎవరిదన్నది ప్రశ్నార్థకంగా మారింది.మండల శివారులో ఓకార్పొరేట్ పాఠశాల రూటే సపరేటు అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. నియమ నిబంధనలపై నిర్దిష్ట సమాచారం అందుబాటులో లేకుండా గాలికి వదిలేశారు. అయితే, ఈ పాఠశాలల నిర్వహణలో కొన్ని అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అవి ఏంటంటే కొన్ని చైతన్య పేరుతో నిర్వహిస్తున్న పాఠశాలలు అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నట్లు, ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే పాఠశాల భవనాల నిర్మాణం సక్రమంగా లేదని, విద్యార్థుల భద్రత ప్రమాదంలో ఉందని కూడా ఆరోపణలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలో ధర్మరాజుల ఆలయానికి సమీపంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రమాదం ఉంచి ఉందని చెప్పవచ్చు. ఈ పాఠశాల పక్కనే భారత్ గ్యాస్ గౌడన్ ఉంది. నియమ నిబంధన ప్రకారం ఇలాంటి గోడెన్స్ కి దూరంగా పాఠశాలలు నిర్వహించాలి. దీనికి విరుద్ధంగా పాఠశాల ముందే భారత్ గ్యాస్ ఎగుమతులు దిగుమతులు చేసుకుంటున్నారు. చైతన్య పాఠశాల నిబంధనలు ప్రకారం అక్కడ ఏడవ తరగతి వరకే పాఠ్యాంశాలు బోధించాలి. అయితే ఇందు కువిరుద్ధంగాపదవతరగతివరకతరగతులుఈ పాఠశాల యాజమాన్యం నిర్వహి స్తున్నారు.దీనిపై ఎంఈఓ ని వివరణ కోరగా పలు మార్లు తాఖీదులు,నోటీసులు జారి చేసామ న్నారు. మరి వారుస్పందించకుంటేచట్టపరిధిలోతాము చర్యలు తీసుకుంటామని ఎంఇఓ వివరణ ఇచ్చారు.

శ్రీ అగస్తీశ్వర ఆలయ చైర్మన్‌గా కన్నలి రామచంద్రారెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

పెద్ద కన్నలి గ్రామం అగస్తీశ్వర ఆలయ చైర్మన్ గా కన్నలి.రామచంద్ర రెడ్డి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు కన్నలి ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ఎన్నుకున్నారు. పాలకమండలి సభ్యులుగా కందటి సుబ్బా రామిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ రెడ్డి, కూన రాజారెడ్డి, గల్లా వెంకటసుబ్బయ్య, పి చెంచురత్నం, సి నాగమణి, కే సుబ్రహ్మణ్యం, ఇందుకూరి సూరిబాబు, కోగిల రాజాలను ఎన్నుకున్నట్టు కన్నలి. ప్రతాపరెడ్డి ఓ ప్రకటనలో పత్రికల వారికి తెలిపారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

తొట్టంబేడు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్ఈ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గుండేలి గుంట గ్రామంలో కరంటోళ్ళ జన బాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి సమస్యలు వచ్చినా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ చిన్న రెడ్డప్ప, ఏడిఈ సుధాకర్, ఏ ఈ బాలాజీ విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి మాధవరెడ్డికి అభినందనల వెల్లువ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి10 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన విదుదల మాధవరెడ్డికి పలువురు నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు శుభాభినందనలు తెలియజేసారు. మంగళవారం ఉమ్మడి మంగళం పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎంపిపిని ఘనంగా దుశ్శాలువాలతో సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ జడ్పి చైర్మెన్ సుబ్రమణ్యంరెడ్డి ఎంపిపికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో అవిలాల సర్పంచ్ చెందిలి వెంకటరమణ, గొల్లపల్లి సర్పంచ్ విదుదల రవిరెడ్డి, లింగేశ్వర్‌నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు, మాస్ అధ్యక్షుడు కె.జ్ఞానశేఖర్‌రెడ్డి, రుద్రగోఫి, శివరాజు,రామిరెడ్డి, నారాయణరెడ్డి, గోఫి,సుధాకర్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు. కొత్త బాధ్యతలతో ప్రజాసేవకు మరింత అంకితభావంతో ముందుకు సాగుతామని ఎంపిపి మాధవరెడ్డి ఈసందర్భంగా పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయల పాలైనట్లు తిరుపతిరూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం యూనివర్శిటీ నుంచి హైవే వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తిరుమల నగర్ 5వ క్రాస్ వద్ద కారు అతివేగంగా ఢీకొట్టడంతో యువకున్ని ఇద్దర్ని రుయాకు తరలించి అత్యవసర చికిత్స అందిస్తుండగా విక్రమ్ మృతి చెందాడు. మృతుడు తుమ్మలగుంట ఉప్పరపల్లికి చెందిన మాలే విక్రమ్ (19) గుర్తించారు. మరో యువకుడు రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై తిరుపతిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చప్పగా సాగిన సర్వసభ సమావేశం.

రేణిగుంట ఫిబ్రవరి 10 ప్రభాతవార్త. రేణిగుంట మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనం నందు మంగళవారం ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో రవిచంద్ర పర్యవేక్షణలో చప్పగా సాగింది. సభ్యులు అనేక సమస్యలు సభలో ప్రశ్నించినప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. సమావేశానికి వచ్చిన వివిధ శాఖల ప్రతినిధులు తమ శాఖలలో జరిగిన అభివృద్ధిని చదివి సభ్యులకు వినిపించారు. సభ్యులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఎంపీటీసీలు, జడ్పిటిసి, వివిధ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా గోడు మీకు పట్టదా.....

రేణిగుంట ఫిబ్రవరి 10 ప్రభాతవార్త పారిశుద్ధ్య కార్మికుల గోడు అధికారులు పట్టించుకోవడంలేదని రేణిగుంట పంచాయతీ కార్మికులు కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేసి కార్యదర్శి రమేష్ బాబుకు ప్రతిపత్రం సమర్పించారు

జాబ్ మేళా నిర్వహించిన పలు కంపెనీలు

నాయుడుపేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్ ఆధ్వర్యంలో నెలవల విజయశ్రీ ప్రిన్సిపాల్, సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యులు ఆదేశాల మేరకు మంగళవారం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళ కార్యక్రమం నిర్వహించారు. జాబ్ మేళాను ఉద్దేశించి జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 20 లక్షలు ఉద్యోగాలలో భాగంగా స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు జాబ్ మేళా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన కనీస వేతన సదుపాయం కలదు అని తెలియజేశారు. అదేవిధంగా ఉద్యోగంలో సెలెక్ట్ కాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సూళ్లూరుపేట నియోజకవర్గంలో గవర్నమెంట్ ఐటిఐ, తడ స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని అందులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం నిరంతరంగా జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా.ప్రవీణ కుమారి ప్రిన్సిపాల్, నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుకొని ఖాళీగా ఉన్నటువంటి వారికి అలాగే ఫైనల్ ఇయర్ చదువుతున్నటువంటి వారికి ఇలాంటి జాబ్ మేళా జరగడం వల్ల ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చు కోవచ్చని తెలియజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలప్రిన్సిపాల్ డా. ప్రవీణ కుమారి, ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. వాసప్ప, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది, ఏపీఎస్ఎస్డిసి తిరుపతి జిల్లా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

నేదురుమల్లి కుటుంబంతోని అభివృద్ధి సాధ్యం

వెంకటగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: నియోజకవర్గంలో నేదురుమల్లి కుటుంబం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య తెలిపారు. వెంకటగిరిలోని ఎన్ జే ఆర్ భవనంలో వైసిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేదురుమల్లి కుటుంబాన్ని విమర్శించే అర్హత తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని తెలిపారు. నేదురుమల్లి కుటుంబం వెంకటగిరిలో 40 సంవత్సరాల నుంచి ఉన్నారని తెలిపారు. వారు స్థానికులు కాదని తెలుగుదేశం వారు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వారు చేసిన అభివృద్ధి ఎవరు చేయలేదని చెప్పారు.నేదురుమల్లి కుటుంబాన్ని విమర్శిస్తే ప్రజలు తగు గుణపాఠం చెప్తారన్నారు. జిల్లా టెలికాం సలహాలు సభ్యులు చిట్టేటి హరికృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వాన్ని అవినీతి అక్రమాలు జరిగాయని తెలిపారు. పట్టణంలో హ్యాండ్లూమ్ టెక్నాలజీ, తొమ్మిదవ పోలీస్ బెటాలియన్, సమ్మర్ స్టోరీ ట్యాంకు, నిమ్మ పరిశోధన కేంద్రం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. కౌన్సిలర్లు ధనియాలు రాదా, శంకరయ్య, ఎంఏనారాయణ, కళ్యాణి,నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

వెంకటగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఈ నెల 12వ తేదీ జరగబోవు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వెంకటగిరి పట్టణ పురవీధుల్లో కార్మిక, విద్యార్థి, ఇంకా పలు సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్ సెంటర్ నుండి బయలుదేరి పాల కేంద్రం మీదుగా, క్రాస్ రోడ్, ఆర్టీసీ బస్టాండ్, కాసిపేట, రాజా వీధి, తూర్పు వీధి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఆయా సెంటర్స్ కూడలిలో సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వివి రమణయ్య ఏఐటీయూసీ నాయకులు జాన్, సిపిఐ నాయకులు శివ, పిడిఎస్ ఒ కన్వీనర్ పవన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి, సిపిఐ మండల కార్యదర్శి నరసింహారావు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్నాయకులు, మీనా రైతు కూలీ సంఘం నాయకులు కృష్ణారెడ్డి, సిఐటియు నాయకులు ప్రసాద్, పోలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజయ్య, విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం వి రమణ హై బస్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు బాలయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తంబి రాజా, మహిళా సంఘం నాయకులు లక్ష్మమ్మ, వీధి వ్యాపారుల సంఘం మునెయ్య,మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యకల్యాణం పచ్చతోరణం... శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవ శోభ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ ప్రతిష్టాత్మకంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించుటకు ప్రణాళికలు రూపొందిం చారు. పలుమార్లు మంత్రులు, శాసనసభ్యుడు సమీక్షలు జరిపారు. రెండు నెలల పాటు ఏర్పాట్లు చేసారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆహ్వానాలు, ఉభయదారులకు ఎనలేని ప్రాధాన్యత కల్పించి ఆహ్వానాలు అందించారు.

ఊరంతా ఉత్సవ వాతావరణం:

శ్రీకాళహస్తి పట్టణంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఊరంతా సంబరాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం బిక్షాల గాలిగోపురం,దక్షిణ గోపురం, రెండు గేటు వద్ద పూలతో 'శివరాత్రి బ్రహ్మోత్సవాలు' రూపకల్పన చేసారు. ఇక పట్టణంలోని నాలుగు మాడవీధులతో పాటు తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధి, బజారువీధి, బాబూ అగ్రహారంలో నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు మామిడి తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేసి పండగ వాతావరణం కల్పించారు. విద్యుత్ దీపాల తోరణాలతో పట్టణం దేదీప్యమానంగా వెలిగిపోతుంది. స్వర్ణముఖి నదిపై నిర్మించిన మూడు వంతెనలపై లైటింగ్, భక్తకన్నప్ప కొండపై ఏర్పాటు చేసిన పార్వతి పరమేశ్వరుల విగ్రహాలు సుమారు 15కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు దర్శనమిస్తూ ఆకట్టుకుంటుంది. అంగరంగ వైభవంగా ముస్తాబై భక్తకన్నప్ప ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. ఆలయంలో విద్యుత్ దీపాలు, ప్రత్యేకంగా తెప్పించిన బెంగుళూరు పూలతో చేసిన అలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నవయుగ రాజగోపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఓంకార నాధ జెండాలు రెపరెపలాడుతూ ఆధ్యాత్మిక భావన పెంపొందిస్తున్నాయి. సాంస్కృతికి కార్యక్రమాలు భక్త జనులను అలరిస్తున్నాయి.

తిరుమల లడ్డులో కల్తీ జరగలేదు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ అల్లూరి రాహుల్ రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు కల్తీ జరగలేదని రాష్ట్రంలో సంక్షేమం పథకాలను అమలు చేయలేక పవిత్రమైన లడ్డు గురించి కూటమి ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు వేణుంబాక మునస్వామి నాయుడు అల్లూరు రాహుల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి వేమిరెడ్డి గోపిరెడ్డి, రాజగోపాల్‌లు పాల్గొన్నారు.

తుడా చైర్మన్‌ని సన్మానించిన పేట టిడిపి నేతలు

నాయుడుపేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని నాయుడుపేట పట్టణానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలు డాలర్స్ దివాకర్ రెడ్డికి శాలువాలు కప్పి, సన్మానించి సాధర స్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు జి.వి.ఆర్ నాయుడు, జువ్వలపాటి మస్తాన్, బల్లి ముత్యాలయ్యలు డాలర్స్ దివాకర్ రెడ్డికి శాలవాకప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని టిడిపి నాయి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వినుకొండ ధనుంజయ ఘనంగా సన్మానించారు.

వాకాడులో యుఎఫ్ఎస్ సర్వే

వాకాడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: వాకాడులోని బజారు వీధిలో పంచాయతీ కార్యదర్శి ప్రవళిక ఆధ్వర్యంలో యుఎఫ్ఎస్ సర్వే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రమైన వాకాడులోని తుమ్మలగుంట, కైకాలవీధి, బజారు వీధిలో ఇంటింటికి తిరిగి పంచాయతీ కార్యదర్శి ప్రవళిక సర్వే చేపట్టారు. ఆమె వెంట పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళా మోర్చా ఆఫీస్ కార్యదర్శిగా రాయి

బాలాయపల్లి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: బాలాయపల్లికి చెందిన రాయి దేవిక చౌదరిని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అఫీషియల్ కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఆమెకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఉత్తర్వులు పంపారు. తనపై ఉన్న నమ్మకంతో బిజెపి రాష్ట్ర పదవి ఇచ్చారని దేవికా చౌదరి తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. అందర్నీ కలుపుకొని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు.

నంద్యాల మార్కెట్ కాంట్రాక్టర్‌చే కూరగాయలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దాతల నుంచి విశేష స్పందన వస్తుంది. బ్రహ్మోత్సవాలకు సుమారు 20సంవత్సరాల నుంచి నంద్యాల మార్కెట్ కాంట్రాక్టర్ పది రోజుల పాటు వచ్చే భక్తులకు అందించే భోజనాలకు సంబందించిన కూరగాయాలను అందిస్తున్నారు. సోమవారం నంద్యాలకు సంబంధించిన కూరగాయల మార్కెట్ కాంట్రాక్టర్ ప్రసాద్ పదిటన్నుల కూరగాయలను ఆలయ ఇఓ డి.బాపిరెడ్డికి అందించారు. ఇంకా ఎన్ని కూరగాయలు అవసరమైనా అందిస్తామని ప్రసాద్ వివరించారు. తనకు శివయ్య భక్తులకు భోజనాల్లో అందించే కూరగాయలను అందించే భాగ్యం కల్గిందని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రసాద్ కూరగాయలను ఆలయ చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్,స్టోర్స్ ఇన్‌చార్జి నాగభూషణం నాయక్‌లు పాల్గొన్నారు.

తొండమాన్‌పురంలో కోయిల్ ఆళ్వార్

(శ్రీకాళహస్తిరూరల్-ప్రభాతవార్త)

శ్రీకాళహస్తి మండలంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయాన్ని శుద్ధి చేసే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం అళ్వార్ తిరుమంజనం ఆలయాన్ని శుద్ధి చేసారు.ఈ కార్యక్రమాల్లో ఏఇ ఆంజనేయరాజు ఆలయ ఇన్స్పెక్టర్ సుధీర్, ప్రధానార్చకులు రమణ స్వామి, కృష్ణస్వామి, బాబుస్వామి, మాధవ స్వామి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నైవాసులచే స్వామి అమ్మవార్ల పట్టు వస్త్రాలు

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మంగళవారం చెన్నైకు చెందిన దాతలు స్వామి అమ్మవార్లకు పట్టు చీరలు, పంచెలను అందించారు. తమిళనాడు వాసులు ఎస్.సయ్య దొరైనాగరాజు కుటుంబ సభ్యులతో విచ్చేసి వితరణ అందించారు. స్వామి వారికి 20 పట్టు పంచెలు, అమ్మవారికి 16 పట్టు చీరలు అందించారు. వీటిని ఆలయ అభిషేక గురుకుల్స్ రాజేష్, సురుష్, నిరంజన్‌ల ద్వారా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డికి అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో నాగరాజన్ మేనేజర్ పి.నాగేంద్రరావు,ఆలయ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వద్ద రాజకీయ ఆందోళన శోచనీయం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: తిరుపతిలోని బాలాజీ నర్సింగ్ కాలేజ్ ఎదుట కొన్ని రాజకీయ పార్టీలు ధర్నాతో కళాశాల వద్ద భయాందోళన చేయడం తీవ్ర ఆవేదన గురయ్యామని, కళాశాలలో చదివే విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తెలియజేసారు. విచారణ జరుగుతున్న వ్యవహారంపై వివాదాస్పదం చేయడం సరైనది కాదంటూ విద్యార్థులు మంగళవారం ప్లేకార్డులు ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థిని, ఇటీవల కళాశాల హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని తెలిపారు. చనిపోయిన విద్యార్థినిని అడ్డం పెట్టుకొని కళాశాల ఎదుట ధర్నా నిర్వహించడం హాస్యాస్పదమని వెల్లడించారు. కళాశాల చైర్మన్ వై.ప్రవీణ్‌పై వస్తున్న ఆరోపణలు నిజం కాదని వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, దళిత సంఘాల నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ పోర్టల్ అవసరం : ఎంపీ

వెంకటగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: రెవెన్యూ సమస్యలపై జాతీయస్థాయిలో ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని ఎంపీ మద్దెల గురుమూర్తి తెలిపారు. రెవెన్యూ, భూ సంబంధిత సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే విధమైన, పారదర్శకమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారం అందించేందుకు జాతీయ రెవెన్యూ ఫిర్యాదుల పరిష్కార పోర్టల్ ఏర్పాటు చేయాలనే అంశాన్ని తిరుపతి లోక్‌సభ సభ్యులు పార్లమెంట్‌లో లేవనెత్తారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ వివాదాలు, భూ రికార్డుల లోపాలు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీని వల్ల సమయం, ధనం తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన ప్రశ్నలో పేర్కొన్నారు. అయితే ఈ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. చంద్రశేఖర్ పెమ్మసాని ఇలాంటి జాతీయ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

విద్యార్థులకు పౌష్టిక ఆహారం పంపిణీ

వెంకటగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికేఆర్ ఆహారాన్ని విధిగా అందించాలని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. సిడిపిఓ కార్యాలయంలో అంగన్వాడి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భవతులు చిన్నారులకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పౌష్టికర ఆహారాన్ని అందించాలని తెలిపారు. సమావేశంలో టాటా ట్రస్ట్ డిపిఓ అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన కేసులో...భర్త అరెస్ట్

వెంకటగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: భార్యను వేధించిన కేసులో భర్త అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపినట్లు ఏఎస్ ఐ.రమణయ్య తెలిపారు. వెంకటగిరికి చెందిన మహిళతో అవినాష్ రెడ్డికి వివాహం అయింది. పెళ్లి అనంతరం నాకు ఇష్టం లేదని ఆమెను ఇంటికి పంపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని తెలిపారు.

కళలు మన సంప్రదాయాలకు మార్గదర్శకాలు

-సీని దర్శకుడు అనిల్ రావిపూడి

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: కళలు మన సంప్రదాయాలకు మార్గదర్శకాలని ప్రముఖ దర్శకుడు,రచయిత అనిల్ రావిపూడి అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన సాంస్కృతిక వేదికను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సారధ్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవం కార్యక్రమాలకు అనిల్‌రావిపూడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం కళలను ప్రోత్సహించుటకు కళాకారులను ఆదరించుటకు చూపుతున్న శ్రద్ధ అభినందనీయం అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్,ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టే సాయి, సభ్యులు, డెప్యూటీ ఇఓ కృష్ణారెడ్డి, ఆలయ పర్యవేక్షకులు విజయసారధి, హేమామాలిని, దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

-ఓంకార జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి

తిరుపతి, ఫిబ్రవరి 10ప్రభాతవార్త: రేణిగుంట మండలం వెదల్ల చెరువులో వెలసిన ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్థానిక కపిల తీర్థం నంది విగ్రహం వద్ద శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. 15న మహాశివరాత్రి రోజు ఉదయం నుండి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర స్వామి, సింగంశెట్టి సుబ్బరామయ్య, జంగం శెట్టి ముని సుబ్రహ్మణ్యం, లోక ప్రభాకర్ నాయుడు, ఆదం అనిల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి,తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, అన్నారెడ్డి రాజశేఖర్ రెడ్డి, పురోహితులు సురేష్ స్వామి, ఆది గురుస్వామి, కే.ఎన్ రాజా, డాక్టర్ అర్జున్,ఆర్ఎస్ఎస్ నాయకులు బండారు భరత్ కుమార్ మునిరత్నం ధనుంజయులు ఎల్ కృష్ణయ్య, ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగమణికి పద్మావతి వర్సిటీ డాక్టరేట్

యూనివర్సిటీ(తిరుపతి),ఫిబ్రవరి 10ప్రభాతవార్త:ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డి.నాగమణికి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.అనురాధ తెలిపారు. ఈమె శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ వై.ఇందిరా ముజీబ్ గారి మార్గదర్శకత్వంలో డిజైన్, ఫ్యాబ్రికేషన్ అండ్ ఇవాల్యుయేషన్ ఆఫ్ బక్కల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకు నాగమణికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. డి.నాగమణికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

భార్యర్థులకు పౌష్టిక ఆహారం పంపిణీ

శ్రీవారి ఆశీస్సులతో...

సంకల్పయాత్ర విజయవంతం

తిరుమల,ఫిబ్రవరి 10ప్రభాతవార్తప్రతినిధి: 23రోజులు 535 కిలోమీటర్లు పాదయాత్ర విజయవంతంగా,సాఫీగా కొనసాగి మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకుని ఆ దేవదేవుడిని దర్శనం చేసుకోవడం తన జీవితంలో ఇదో చరిత్రాత్మకమని సినీనిర్మాత బండ్ల గణేశ్ తెలిపారు. బుధవారం ఉదయం సిఎం చంద్రబాబును కలుస్తాన న్నారు. మంగళవారం ఉదయం ఆయన తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎట్టకేలకు పరీక్షల షెడ్యూల్ విడుదల

-26 నుంచి ఎస్వీయూ పరిధిలో ఇయర్లీ ప్యాటర్‌ను పరీక్షలు

తిరుపతి విద్య, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: ఇయర్లీ ప్యాటర్న్ పరీక్షల షెడ్యూల్ కోసం ఏళ్ల తరబడి నిరీక్షి స్తున్న విద్యార్థులకు ఎస్వీయూ ఎట్టకేలకు తీపికబురు అందించింది. ఎస్వీయూ పరిధిలో ఇయర్లీ ప్యాటర్న్ ద్వారా అన్ని రకాల కోర్సులలో యూజీ పూర్తి చేసి సబ్జెక్టులలో తప్పిన విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజామాణ్యికం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, ఇప్పటికే పరీక్ష ఫీజులను చెల్లించిన విద్యార్థులు ఈ మేరకు సన్నద్ధం కావాలని సూచించారు. అభ్యర్థులు హాల్ టికెట్లకోసం ఏదేని ఐడీ ప్రూఫ్, ఆధార్ కార్డు ఒరిజినల్తో ఎస్వీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈనెల 20 నుంచి హాల్టికెట్లను జారీ చేయనున్నట్లు ఆయన ఆప్రకటనలో పేర్కొన్నారు.

14 నుంచి మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు

- 15న పట్టు వస్త్రాలు సమర్పణ - ఆలయ చైర్మన్ ఎస్.ప్రసాద్ రాయల్

కల్లూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: పులిచర్ల మండలంలోని కావేటిగారిపల్లెలో వెలసిన శ్రీశ్రీశ్రీ స్వయంబు మల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14వ తేదీ కళశ స్థాపనతో ప్రారంభమై 16వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఎస్.ప్రసాద్ రాయల్ తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 15వ తేదీ మహా శివరాత్రి పర్వదినాన స్వామి వారికి పట్టు వస్త్రాలను పుంగనూరు నియోజకవర్గం బాధ్యులు చల్లా రామచంద్రరెడ్డి, బాబురెడ్డి కుటుంబ సభ్యులు ప్రభుత్వం తరపున సమర్పించనున్నారని తెలిపారు.

సందడిగా మారిన చెవిరెడ్డి నివాసం

-ఆత్మీయ పరామర్శకు వెల్లువెత్తిన జనం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త: మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొని... అక్రమ అరెస్టై...విడుదలైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పరామర్శించటానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సందడి నెలకొంది. పరామర్శకు వచ్చిన ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరిస్తూ... ధైర్యం చెబుతూ ముందుకు సాగారు.

ధూర్జటి సాంస్కృతిక వేదికపై నేడు

11.02.2026 బుధవారం-నేడు స్వామి వారి ధ్వజారోహణం

రాత్రి7.00గం.కు సినీ గాయని గీతామాధురిచే భక్తి సంగీత విభావరి
ఉ॥10గంటలకు వెంకటగిరికి చెందిన చింతపట్ల సాయిబాబాచే ప్రవచనం
10.30గంటలకు శ్రీకాళహస్తికి చెందిన ప్రభాసినిచే భక్తిగీత శ్లోకాలు
11.00గంటలకు తిరుచానూరుకు చెందిన పూర్ణిమచే భక్తి సంగీత కచ్చేరి
11.30గంటలకు హైదరాబాదుకు చెందిన బి.భాగ్యమ్మ